సమస్యల తాండవం

- పొదిలి పట్టణాన్ని చుట్టుముట్టిన సమస్యలు
- తాగునీటి కోసం విలవిల్లాడుతున్న పట్టణ వాసులు
- అంతర్గత రహదారులు, డ్రెయినేజీల అభివృద్ధిపై స్పందన శూన్యం
- రోడ్లపైకి చేరుతున్న మురుగుతో అవస్థలు
- కుక్కలు, కోతులతో నిత్యం తంటాలు
- ఊసే లేని అమృత్ నిధుల వినియోగం



ఆక్రమణల మూలంగా ప్రధాన రహదారి దుస్థితి(ఫైల్)



మంచినీటి కోసం రోడ్డెక్కిన మహిళలు (ఫైల్)



పొదిలి పట్టణ వ్యూ

పొదిలి:

నగర పంచాయతీగా రూపాంతరం చెందిన క్షణం నుంచి పొదిలి పట్టణాన్ని సమస్యలు వీడటం లేదు. 2020 డిసెంబర్ 30వ తేదీన నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయిన పొదిలి పట్టణంలో నేటికీ పాలకవర్గం లేకపోవడంతో సమగ్ర అభివృద్ధికి ఆటంకంగా మారింది. నగర పంచాయతీలో సమీప గ్రామ పంచాయతీలను విలీనం చేయడంపై కొందరు కోర్టులో కేసు వేయడంతో ఎన్నికల ప్రక్రియ నిర్వహించేందుకు వీల్లేకుండా పోయింది. పట్టణ అభివృద్ధిపై చొరవ చూపాల్సిన అధికారులు సైతం గత కొంత కాలంగా మిన్నకుండిపోవడంతో తాగునీరు, డ్రెయినేజీలు, అంతర్గత రహదారులు తదితర సమస్యలతో పొదిలి వాసులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

పొదిలి నగర పంచాయతీ పరిధిలో 20 వార్డులు ఉండగా, సుమారు 9 వేల గృహాల్లో 45 వేల మంది వరకు నివసిస్తున్నారు. జిల్లా నడికూడలి కావడంతో పొదిలి నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రధాన రహదారిలో చేపట్టిన ప్రణాళికా రహిత ఆక్రమణల తొలగింపు ట్రాఫిక్ కష్టాలను రెట్టింపు చేసింది. వర్షం కురిస్తే ప్రధాన రహదారి మొత్తం రాకపోకలకు ఆటంకంగా మారుతోంది. అక్కడక్కడా సైడు కాలువలను పెల్లగించి మమ అనిపించడంతో ట్రాఫిక్ సమస్య యథావిధిగానే ఉంది.

మంచినీటి కోసం పాట్లు

పట్టణ ప్రాణధార బుగ్గజలం బావిలో నీరు అడుగంటిపోవటం, సాగర్ పైప్ లైన్ పనులు ఎన్నికల నాటి నుంచి నిలిపేయడం, అవసరమైనన్ని ట్యాంకర్లతో నీరు సరఫరా చేయకపోవడంతో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. టైలర్స్ కాలనీ, బాప్టిస్ట్‌పాలెం, కేవీపాలెం బీసీ కాలనీ, పిచ్చిరెడ్డితోట, ప్రకాశ్‌నగర్, నేతపాలెం, ఇస్లాంపేట, బ్యాంకు కాలనీలో కొంత బాగం, కాలేజీ రోడ్డులో మొదటి, రెండు లైన్లలో నీటి సమస్య అధికంగా ఉంది. సమస్య పరిష్కారం కాకపోవడంతో మహిళలు రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేసే పరిస్థితులు ఏర్పడ్డాయి.

శునకాలు, కోతుల బెడద

గతంలో కుక్కలు, కోతుల బెడదతో పట్టణ వాసులు అల్లాడిపోయారు. కోతుల బెడద తొలగిందని భావించే లోపే, మళ్లీ కోతులు పట్టణ వాసులపై దాడి మొదలెట్టాయి. కుక్కల బెడద నేటికీ తొలగలేదు. ఏదో ఒక ప్రాంతంలో వీధి కుక్కలు దాడి చేస్తుంటంతో పిల్లలు హడలిపోతున్నారు.

అభివృద్ధి ఊసేది?

నగర పంచాయతీ నిధులతో గుర్తింపునకు నోచుకునే ఏ పనీ పొదిలిలో చేపట్టలేదు. అమృత్ నిధులు, రామతీర్థం పథకం నిధులు ఎంత వరకు వచ్చాయో తెలియని పరిస్థితి. డివైడర్లు, సైడు కాలువలు నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ కోసం మంజూరైన నిధులను పొందడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలున్నాయి. నిధులు సాధించి, కోర్టులో వ్యవహారం కొలిక్కి తెచ్చి పాలకవర్గం ఏర్పాటయ్యేలా చూడాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

రోడ్లపైనే మురుగు ప్రవాహం

సైడు కాలువలు శిథిలావస్థకు చేరడం, పలు చోట్ల సైడు కాలువలు లేకపోవటంతో మురుగు రోడ్లపైకి చేరుతోంది. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు, గీతాంజలి స్కూలు ఎదురుగా, ఆర్టీసీ గ్యారేజీ కాంపౌండ్ వాల్ వద్ద, నేతపాలెంలో పాత పంచాయతీ కార్యాలయం ఎదురుగా మురుగు రోడ్లపైనే నిల్వ ఉంటోంది. మరో వైపు అలుగు కాలువలు మురుగుకూపాలుగా మారాయి. దోమలు విజృంభిస్తుండటంతో రోగాల బారిన పడుతున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



విశ్వనాథపురంలోని ఓ రోడ్డు పరిస్థితి

కోర్టు కేసు త్వరగా తేల్చాలి



కోర్టు కేసు కారణంగా పొదిలిలో పాలకవర్గం ఏర్పాటుకు అవకాశం లేకుండా పోయింది. నాలుగున్నరేళ్లుగా అధికారుల పాలనలోనే నగర పంచాయతీ ఉంది. పాలకవర్గాలు ఏర్పడితే నిధులు తెచ్చుకుని అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. మరో వైపు వందలాది మంది కూలీలకు ఉపాధి పనులు లేకుండాపోయాయి. అధికారంలో ఉన్న వారు కోర్టు వ్యవహారాలు తేలేలా చర్యలు తీసుకోవాలి.

– కేవీ రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నీటి సమస్య లేకుండా చూడాలి



పట్టణంలో నీటి సమస్య అధికంగా ఉంది. తాత్కాలిక పరిష్కారంగా ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయడంతోపాటు శాశ్వత పరిష్కారంగా పెద్ద చెరువు రిజర్వాయర్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. నీటిని కొనుగోలు చేసి అవసరాలు తీర్చుకోవాలంటే పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– నూర్జహాన్ బేగం, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం కార్యదర్శి

ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి



జిల్లా నడికూడలి అయినందున ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోంది. ఆక్రమణల తొలగింపు పేరుతో చేపట్టిన పనులు అభాసుపాలయ్యాయి. ఎవరి దుకాణం ముందు వారు మెరక చేసుకుంటుండటంతో వర్షం నీరంతా రోడ్డుపైకి చేరి రాక పోకలకు అసౌకర్యంగా మారుతోంది. మరో వైపు సైడు కాలువల్లోని మురుగు కూడా రోడ్డుపైకి చేరుతుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

– ఎంవీ రమణ కిషోర్, న్యాయవాది

క్లుప్తంగా

ప్రకాశ్‌నగర్‌లో పర్యటించిన కమిషనర్

పొదిలి: స్థానిక ప్రకాశ్ నగర్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం నగర పంచాయతీ కమిషనర్ కేఎల్ నారాయణరెడ్డి పర్యటించారు. పారిశుధ్య పనులను పర్యవేక్షించి కార్మికులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీరు, మురుగు సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

ఆలయ భూమి ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పొదిలి: స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ భూమి ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఎంపీటీసీ మాజీ సభ్యుడు, బీజేపీ నాయకుడు ఆకుపాటి లక్ష్మణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత పంచాయతీ కార్యాలయం సమీపంలో 853–3 సర్వే నంబర్‌లోని 50 సెంట్ల భూమి ఆలయానికి చెందినదిగా రికార్డుల్లో ఉందని పేర్కొన్నారు. అయితే రికార్డులు తారుమారు చేసి 2009లో అప్పటి తహసీల్దార్ కొందరు వ్యక్తులకు ఎన్‌ఓసీ ఇవ్వగా, వారు మరి కొందరి పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. అక్రమంగా ఎన్‌ఓసీ ఇచ్చిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవటంతో పాటు రిజిస్ట్రేషన్ రద్దు చేయించి, భూమి ఆలయానికి చెందేలా చూడాలని కలెక్టర్‌కు విన్నవించినట్లు పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

కంభం: మండలంలోని తురిమెళ్లలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు కోసం గతంలో దిమ్మె నిర్మించిన స్థలంలో గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా ఇంటి నిర్మాణం చేసుకుంటున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు షెడ్యూల్ కులాల పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు కె.చెన్నకేశవరావు తెలిపారు. 2020లో కూడా ఇంటి నిర్మాణానికి ప్రయత్నిస్తే కేసు నమోదైందని, ఆ కేసు కోర్టులో ఉండగా తిరిగి నిర్మాణ పనులు చేస్తున్నారని, విచారించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

30న పాలిసెట్ ఎంట్రన్స్

మార్కాపురం: ఈనెల 30వ తేదీన మార్కాపురంలోని జార్జి కళాశాలలో పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తారని, ఎవరైనా విద్యార్థులు ఫీజు కట్టి హాల్‌టికెట్టు పొందలేకపోయినా, రిజిస్ట్రేషన్ మాత్రమే చేసి ఫీజు కట్టకపోయినా వారు మార్కాపురం కోఆర్డినేటింగ్ సెంటరైన జార్జి ఇంజినీరింగ్ కళాశాలను సంప్రదించాలని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజబాబు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ డానియేల్ తెలిపారు. ఈ పరీక్షలకు కోఆర్డినేటర్‌గా అద్దంకి గవర్నమెంట్ పాలిటెక్నిక్ హెచ్‌ఓడీ పీ ప్రభాకర్‌ను ప్రభుత్వం నియమించినట్లు తెలిపారు. వివరాలకు 99633 33124, 94401 81910 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆధునిక దేవాలయాలు గ్రంథాలయాలు



పుస్తకాలను అందిస్తున్న మధుసూదన్ శాస్త్రి దంపతులు

మార్కాపురం: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని సాధనా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే మధుసూదన్ శాస్త్రి, రిటైర్డు ఆర్‌జేడీ డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులను సోమవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పుస్తక పఠనం విద్యార్థులకు తప్పనిసరి అన్నారు. వేసవి విజ్ఞాన తరగతులను అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. కథలు, పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచినట్లు లైబ్రేరియన్ శివారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కే మధుసూదన్ శాస్త్రి దంపతులు రూ.10 వేల విలువైన పుస్తకాలను ఉచితంగా అందించారు.

సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కల్పించండి

- కమిషనర్ నారాయణరావు



పుస్తకాలు అందిస్తున్న కమిషనర్ నారాయణరావు, పక్కన ఎంఈఓ, సీడీపీఓ

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా తమ పరిధిలో ఉన్న ఇళ్లకు వెళ్లి లింగ వివక్ష, సంపూర్ణ ఆరోగ్యం, నాణ్యమైన విద్య, వ్యక్తిగత పరిశుభ్రత, లైంగిక వేధింపులపై అవగాహన కల్పించాలని కమిషనర్ నారాయణరావు సూచించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలను పూర్తిగా నిరోధించేందుకు కృషి చేయాలన్నారు. సీడీపీఓ సుశీలాదేవీ మాట్లాడుతూ.. మహిళలకు ఆత్మరక్షణ, వృత్తి నైపుణ్యం, ఉపాధి అవకాశాల గురించి చెప్పాలన్నారు. అనంతరం ఆశా వర్కర్లు, ఆర్పీలకు కిశోరి వికాసం పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ శర్వాణి, సూపర్‌వైజర్లు బుజ్జి, అరుణ, మెప్మా పీఓ ఎలీషా, సరస్వతి పాల్గొన్నారు.

ఎన్‌జీవో హోమ్ రికార్డులు ఆన్‌లైన్ చేయాలి

మార్కాపురం టౌన్: డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో ఉన్న ఏపీ ఎన్‌జీఓ హోమ్ రికార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అసోసియేషన్ కార్యదర్శి వడ్లమాని శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సీహెచ్ రామచంద్రారెడ్డి, ఎ.శ్రీనివాసులు స్థానిక తహసీల్దార్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం మీ కోసం కార్యక్రమంలో తహసీల్దార్ చిరంజీవికి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్‌కు కేటాయించిన స్థలం, అందులోని భవనం రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆన్‌లైన్ చేసి 1బి అడంగల్ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

అర్జీలు స్వీకరించిన సబ్‌కలెక్టర్

కాగా సోమవారం మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ త్రివినాగ్, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ చిరంజీవి ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అర్జీల పరిష్కారం కోసం సంబంధిత శాఖలకు పంపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ చిరంజీవి

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు



బేస్తవారిపేటలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి



పొదిలిలో వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

బేస్తవారిపేట: గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులను ప్రారంభించారు. గ్రంథపాలకుడు మాట్లాడుతూ.. స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిషు, తెలుగు గ్రామర్, డ్రాయింగ్‌పై విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు సీసీ గంగాధర్, ఉపాధ్యాయులు సుజాత, పీవీ గురుస్వామి పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: గ్రంథాలయాలు జ్ఞానానికి కేంద్రాలుగా పనిచేస్తాయని ప్రముఖ ఆధ్యాత్మిక వక్త గంజి వీరయ్య అన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ తరగతుల ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా శిక్షణ తరగతులు ఉపయోగపడుతాయన్నారు. ఎంఈఓ కావడి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఎం.పిచ్చయ్యయాదవ్, శివప్రసాద్, గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

పొదిలి: స్థానిక గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని రిటైర్డ్ ఉపాధ్యాయుడు హుస్సేన్ పాచ్చా ప్రారంభించారు. గ్రంథపాలకులు కె.శ్యాంసన్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎం.ప్రతాప్‌సింహ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఆర్టీసీ కార్మికుల రిలే దీక్ష

మార్కాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ ఉద్యోగులు ఎన్ఎంయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించి రిలే దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కాశయ్య, బీఎస్ రెడ్డి, టీఎంకే రావు మాట్లాడుతూ.. 2019 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని, అన్ని కేటగిరీల్లో ప్రమోషన్లు ఇవ్వాలని, రిటైర్డు ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోవడం వల్లే రిలే నిరాహార దీక్షలు చేపట్టినట్లు తెలిపారు. దీక్షలో వైవీ రెడ్డి, మూర్తయ్య, కేకే నాయక్, జి.శ్రీనివాసరెడ్డి, ఎస్‌కే హనీఫ్ తదితరులు కూర్చున్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాసులు, దస్తగిరి, టీవీఎస్ రావు, సలీమ్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్షలో పాల్గొన్న ఆర్టీసీ కార్మికులు

నేటి నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు



చెన్నకేశవస్వామి మూలవిరాట్



ముస్తాబైన చెన్నకేశవస్వామి ఆలయం

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతీ సమేత రాజనగరేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి వైభవంగా నిర్వహించనున్నారు. 12 రోజులపాటు రోజుకో ఉత్సవం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. 30వ తేదీన ధ్వజారోహణ, మే 1వ తేదీన రుద్ర మండపం, 2న హనుమంతసేవ, 3న చెన్నకేశవస్వామి కల్యాణం, 4న గరుడసేవ, 5న ఎల్లటేనుగు, 6న శివపార్వతుల కల్యాణం, 7న నందిసేవ, 8న రథోత్సవం, 9న వసంతోత్సవం, 10న ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్న సంతర్పణ చేస్తున్నట్లు చెప్పారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నిరాహార దీక్ష శిబిరంలో పాల్గొన్న ఉద్యోగులు

పొదిలి: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లోనే ఉన్నాయని, వాటి పరిష్కారానికి యాజమాన్యం శ్రద్ధ చూపటం లేదని నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ డిపో చైర్మన్ శేషుకుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ వద్ద సామూహిక నిరాహారదీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 1–2019 సర్క్యులర్ అమలుచేయటం, అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయటం, తొలగింపులు ఆపటం, పదోన్నతులు వెంటనే చేపట్టడం, మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు, విద్యుత్ బస్సుల కొనుగోలు తదితర డిమాండ్లను పరిష్కరించాలన్నారు. మెకానిక్‌లు ఎస్‌కేకే బాషా, బీ కృష్ణ, ఎస్‌డీ అబ్బాస్, డ్రైవర్లు ఎస్‌కేఎం.వలి, బీవీ రావు, ఎంఎస్.వాసులు, వీఎస్.రావు, ఎస్‌కే గౌస్‌మొహిద్దీన్, పీ గణేష్‌బాబులు తొలిరోజు దీక్షలో కూర్చున్నారు. వీరికి మెడలో పూలదండలు వేసి శేషుకుమార్, డిపో కార్యదర్శి ఎస్‌కె.ఆలీ దీక్షలను ప్రారంభించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ బి.రామకృష్ణ, నాయకులు ఐఎస్.రావు, యస్దాని, మాబాషా, ఖాదర్‌బాషా, పీజీ .ప్రసూన, కోకిల, జ్యోతి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లలో ఉచిత సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

రాచర్ల: విద్యాహక్కు చట్టంలోని 12 (1) సీ మేరకు ప్రైవేటు స్కూళ్లలో ఒకటో తరగతి 25 శాతం ఉచిత సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో వారణాసి గిరిధరశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతికూల పరిస్థితుల ఎదుర్కొంటున్న బలహీన వర్గాల పిల్లలకు ప్రైవేటు స్కూళ్లలో ఒకటో తరగతి ప్రవేశాలకు 25 శాతం విద్యార్థులు చేరే అవకాశం ఉంటుందని, అర్హత కలిగిన విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వచ్చే నెల 15వ తేదీలోపు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలలోపు ఆదాయం ఉండాలని తెలిపారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ జతపరిచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

మార్కాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అలీ జహీర్



నూతన కమిటీని అభినందిస్తున్న న్యాయవాదులు

మార్కాపురం: మార్కాపురం పట్టణ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది అలీ జహీర్ ఎన్నికయ్యారు. సోమవారం కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన ఎన్నికల్లో మొత్తం 138 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో కె.శ్రీనివాస్ చౌదరిపై 31 ఓట్ల ఆధిక్యంతో అలీ జహీర్ గెలుపొందారు. కార్యదర్శి పదవికి వై.అనీల్‌కుమార్, నాగేంద్రరాజు పోటీ పడగా 4 ఓట్ల ఆధిక్యంతో నాగేంద్రరాజు గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా ఉమ్మడి రవీంద్రనాథ్, జాయింట్ సెక్రటరీగా జవ్వాజి మధుసూధన్‌రెడ్డి, కోశాధికారిగా డీజే స్టాలిన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా బి.వేణుగోపాల్, పి.రామచంద్ర వ్యవహరించారు. ఎన్నికల్లో గెలుపొందిన నూతన కమిటీని పలువురు న్యాయవాదులు అభినందించారు.

తర్లుపాడు తహసీల్దార్‌గా కిశోర్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..

తర్లుపాడు: మండల రెవెన్యూ అధికారి సెలవుపై వెళ్లడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తీరుపై ×అక్రమాలకు చోటివ్వలేం.. మీకో దండం× శీర్షికన గత శనివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. హనుమంతునిపాడులో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న కిశోర్‌కుమార్‌ను పదోన్నతిపై తర్లుపాడు తహసీల్దార్‌గా నియమించారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ సమస్యలు వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కాగా నూతన తహసీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.



తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కిశోరి వికాసంపై అవగాహన

బేస్తవారిపేట: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో కిశోరి వికాసం కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఐసీడీఎస్ సిబ్బంది, వీఓఏలకు కిశోరి వికాసంపై శిక్షణ ఇచ్చారు. మే 2 నుంచి జూన్ 10 వరకు నిర్వహించనున్న కిశోరి వికాసం కార్యక్రమాల్లో భాగంగా బాల్య వివాహాలను నిరోధించడం, విద్యను కొనసాగించడం, రక్షణ, మహిళల భద్రత, అభివృద్ధిపై వివరించాలని తెలిపారు. 15 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయసువారు వయసు వారు సమావేశాలకు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి పృథ్వీరాజ్, ఐసీడీఎస్ సీడీపీఓ నీలోఫర్ బేగమ్, లీగల్ అడ్వైజర్ రత్నప్రసాద్ పాల్గొన్నారు.

కంభం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ వీరభద్రాచారి అధ్యక్షతన కిశోరి వికాసంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. బాల్య వివాహాల నివారణకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ రత్నప్రసాద్, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, ఎంఈఓ మాల్యాద్రి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అక్తర్ రసూల్, సీడీపీఓ నీలోఫర్, వెలుగు ఏపీఎం మాధవి, మహిళా పోలీసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

శాంతి, ప్రేమ, దయ ఏసు బోధనలు

మార్కాపురం: విద్యార్థి దశ నుంచే తోటి వారిపట్ల శాంతి, ప్రేమ, దయ అలవర్చుకోవాలని ఇవే ఏసు చెప్పిన బోధనలని పాస్టర్ అమృత్‌తేజ్ అన్నారు. స్థానిక ఏబీఎం కాంపౌండులోని తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చిలో వేసవికాల విరామ బైబిల్ పాఠశాలను సోమవారం చర్చి అధ్యక్షుడు డీ శామ్యూల్ ప్రారంభించారు. . చర్చి కార్యదర్శి జయరావు, డైరెక్టర్ సుస్మిత, సండే స్కూల్ సూపరింటెండెంట్ గంగా భవానీ, జయపాల్, ప్రభుదాస్, వీబీఎస్ టీచర్లు హర్షిత, సుజాత, సలోమీ, ఎలిజబెత్, సౌమ్య, సత్యస్రవంతి, విజయకుమారి, వినీల, రఘుబాబు, విజయ్ పాల్గొన్నారు.

ఎండోవాస్క్యులర్ సర్జన్‌కు సత్కారం



వెంకటతేజరెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

గిద్దలూరు రూరల్: డాక్టరేట్ ఆఫ్ నేషనల్ బోర్డు నిర్వహించిన పరీక్షలో గిద్దలూరు పట్టణానికి చెందిన కందుల వెంకటతేజరెడ్డి ఉత్తీర్ణత సాధించారు. చైనాలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లోని యశోదా హాస్పిటల్‌లో ఎండో వాస్క్యులర్ విభాగంలో సేవలందిస్తున్నారు. గిద్దలూరు పట్టణానికి చెందిన కోఆపరేటివ్ బ్యాంక్ రిటైర్డ్ సెక్రటరీ కె.వి.రమణారెడ్డి కుమారుడు వెంకటతేజరెడ్డి జిల్లాలో ప్రథమంగా వాస్క్యులర్, ఎండో వాస్క్యులర్ సర్జరీలో ప్రావీణ్యం సాధించిన సందర్భంగా సోమవారం పలువురు అభినందించారు. గిద్దలూరులోని నివాసంలో ఆయనతో పాటు సతీమణి పీడియాట్రిక్ డాక్టర్ ప్రణయ, తల్లిదండ్రులను సన్మానించారు. అరుణోదయ స్కూల్ మాజీ కరస్పాండెంట్ డి.నాగేశ్వరరెడ్డి, ప్రస్తుత కరస్పాండెంట్ జింకా చంద్రశేఖర్, ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.